RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 116 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శుక్రవారం | 30.10.2026 | పేజీలు : 8



కరువులో మూసీ సుందరీకరణ ఎందుకు?

కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు సెలవు ప్రకటించాలి : కేటీఆర్

- లక్షన్నర కోట్ల మూసీ ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలి
- రైతులను ఆదుకోండి.. పెండింగ్ రైతుబంధు నిధులు విడుదల చేయండి
- ప్రపంచ పెట్టుబడుల సదస్సుపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నేత

నిత్యం నిఘా, హైదరాబాద్, అక్టోబర్ 29 : రాష్ట్రంలో రైతులు సాగునీరు, విద్యుత్ కొరతతో ఇబ్బందులు పడుతుంటే మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరమేమిటని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ముందు వందలాది హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే పరిస్థితి కల్పించిందని ఆరోపించారు. పంటలను..

2

రాష్ట్రంలో పెట్టుబడులకు పూర్తి రక్షణ

- రేవంత్‌రెడ్డి

- పారిశ్రామికవేత్తల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- 2047 నాటికి $3 ట్రిలియన్ల ఎకానమీగా తెలంగాణ
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'
- అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్ సమగ్రాభివృద్ధి

నిత్యం నిఘా, న్యూఢిల్లీ, అక్టోబర్ 29 : తెలంగాణ గడ్డపై అడుగుపెట్టే ప్రతి పెట్టుబడిదారుడికి, వారు పెట్టే ప్రతి రూపాయికి తమ ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుకూల వాతావరణం, ప్రభుత్వపరమైన మద్దతు, వేగవంతమైన విధాన నిర్ణయాల అమలులో ప్రభుత్వం ముందుంటుందని పారిశ్రామిక ప్రముఖులకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఆధునిక మౌలిక వసతులు, నిపుణులైన మానవ వనరులను దృష్టిలో ఉంచుకుని కంపెనీలు తమ వ్యాపార విస్తరణ ప్రణాళికలను మరింత వేగవంతం చేయాలని ఆయన సూచించారు.పెట్టుబడిదారులు తమ ప్రస్తుత పెట్టుబడి లక్ష్యాలను రెట్టింపు చేసుకోవాలని, అందుకు అనుగుణంగా వచ్చే లాభాలు, వృద్ధి రేటును సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తల అనుభవాన్ని గౌరవిస్తూ, వారు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారి విలువైన సలహాలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో మార్పులు చేప



ట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని 'భారత్ ఫ్యూచర్ సిటీ' వేదికగా జరగనున్న అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వాణిజ్య, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.....

2

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ముఖ్యమంత్రి డీపీఆర్ సిద్ధం చేయాలి..
- నిధులు తెచ్చే బాధ్యత నాది
- ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న వ్యర్థాల నిర్వహణ
- లీచేట్‌తో చెరువులు, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన
- డంపింగ్ యార్డు తరలించే వరకు పోరాటం ఆగదు : ఈటల రాజేందర్

నిత్యం నిఘా, కీసర, అక్టోబర్ 29 : జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును తరలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని, అవసరమైన నిధులను కేంద్రం నుంచి తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం ఆయన చేపట్టిన జన సంకల్ప యాత్ర మూడో రోజు కీసర నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, బాధితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కీసరలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన...



2

మెడికవర్ ఘటనపై

మానవ హక్కుల కమిషన్ నోటీసులు



- ఐశ్వర్య మృతిపై నాలుగు వారాల్లో నివేదికకు ఆదేశం
- తెలంగాణ వైద్యారోగ్య శాఖ కార్యదర్శికి నోటీసులు
- సైబరాబాద్ పోలీసు కమిషనర్‌కు జాతీయ కమిషన్ ఆదేశాలు
- శస్త్రచికిత్స తీరుపై కుటుంబ సభ్యుల అనుమానాలు

2



నీటి వృథాను అరికట్టండి : మంత్రి పొన్నం

- ప్రతి కుటుంబం 20 శాతం నీటిని ఆదా చేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు
- నీటి సంరక్షణకు పానీ యాప్ ప్రారంభం
- వాటర్ వారియర్స్‌తో ప్రజలకు భాగస్వామ్యం
- ఎల్-నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

2 లో

టామ్‌కామ్ పేరిట నిరుద్యోగుల నుంచి వసూళ్లు!

- మంత్రి వివేక్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ స్వేరో ఆరోపణలు
- జర్మనీలో ఉద్యోగాల పేరుతో రూ.4.10 లక్షలు వసూలు చేశారని విమర్శ
- ఫెయిర్ ఫ్లీట్ సంస్థ పేరుతో ఒప్పందాలు చేయించారని ఆరోపణ
- 200 మంది నుంచి డబ్బులు తీసుకుని 10 మందిని కూడా పంపలేదని వ్యాఖ్య



నిత్యం నిఘా, హైదరాబాద్, అక్టోబర్ 29 : టామ్‌కామ్ పేరిట విదేశీ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మోసానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ స్వేరో ..

2

సన్న బియ్యం పేరుతో కల్తీ దందా!

- సన్న బియ్యంలో దొడ్డు, రేషన్ బియ్యం కలుపుతున్నారనే ఆరోపణలు
- రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి విక్రయిస్తున్నట్లు అనుమానాలు
- 25 కిలోల సంచిలో 22 కిలోలే నింపుతున్న వైనం
- కర్మన్‌ఘాట్‌లో బియ్యం డిపోలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు



నిత్యం నిఘా, హైదరాబాద్, అక్టోబర్ 29 : హైదరాబాద్ నగరంలో సన్న బియ్యం పేరుతో నాసిరకం బియ్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సన్న బియ్యంలో దొడ్డు బియ్యం, రేషన్ బియ్యాన్ని కలిపి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంతో కలిపి వినియోగదారులకు అంటగడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యమైన బియ్యం కొనుగోలు చేస్తున్నామని భావించి ధర చెల్లిస్తున్న వినియోగదారులు, వాస్తవంగా ఎలాంటి బియ్యం పొందుతున్నారనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది. బియ్యం విక్రయాల్లో తూకం మోసాలు కూడా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 25 కిలోల బియ్యం సంచిగా విక్రయిస్తున్నప్పటికీ, అందులో 22 కిలోల బియ్యమే .....

2

మోదీకి మీడియా ముందుకు వచ్చే ధైర్యం లేదు

- మహేశ్ కుమార్ గౌడ్

- బీజేపీ కంచుకోటల్లో ఓటమి ఆ పార్టీ పాలనపై వ్యతిరేకతకు నిదర్శనం : మహేశ్ కుమార్ గౌడ్
- నాగ్‌పూర్, వారణాసి ఫలితాలపై ప్రధాని సమాధానం చెప్పాలి
- రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీకి గుణపాఠం తప్పదు
- ఎల్‌నినోపై రాజకీయాలు చేయడం సరికాదు



2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రాష్ట్రంలో పెట్టుబడులకు పూర్తి రక్షణ

- రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

'తెలంగాణ రైజింగ్–2047' లక్ష్యాలు

భారతదేశం 2047 నాటికి సాధించతలపెట్టిన 30 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక లక్ష్యంలో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండేలా 'తెలంగాణ రైజింగ్–2047' మార్గసూచీని సిద్ధం చేసినట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉండగా, 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 లక్ష కోట్ల డాలర్లకు, 2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్లకు పెంచడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ ప్రస్థానంలో పరిశ్రమల భాగస్వామ్యం అత్యంత కీలకమని, విస్తరణకు దోహదపడే ఆలోచనలను పంచుకోవాలని కోరారు.

అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్ – కేంద్రం సహకారం

కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్రంలో బృహత్తర మౌలిక వసతుల కల్పన జరుగుతోందని ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో ప్రతిపాదించిన ఏడు హైస్పీడ్ రైలు మార్గాల్లో మూడు హైదరాబాద్‌తో ముడిపడి ఉన్నాయని, ఇవి చెన్నై, బెంగళూరు, పుణె నగరాలను అనుసంధానిస్తాయని చెప్పారు. అలాగే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పునరుద్ధరణ, ప్రాంతీయ రింగ్ రోడ్డు (RRR), మెట్రో రెండో దశ విస్తరణ, నేవీ రాడార్ స్టేషన్ వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందన్నారు. హైదరాబాద్‌ను లండన్, న్యూయార్క్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి గ్లోబల్ మెట్రోపాలిటన్ నగరాల సరసన నిలబెట్టడమే లక్ష్యమని ఉద్ఘాటించారు.

.

ఈ సన్నాహక సమావేశంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, తెలంగాణ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, పలు దేశాల రాయబారులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఐఐ తెలంగాణ విభాగం చైర్మన్ ఎం. గౌతమ్‌రెడ్డి, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా తదితరులు ప్రసంగించారు. డిసెంబర్‌లో నిర్వహించబోయే ప్రతిష్ఠాత్మక సదస్సు ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు విస్తృత చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

మోదీకి మీడియా ముందుకు వచ్చే ధైర్యం లేదు

మొదటిపేజీ తరువాయి.. ప్రధాని నరేంద్ర మోదీకి మీడియాను ఎదుర్కొనే ధైర్యం లేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. రాజకీయాల్లో ఎన్ని స్థానాలు గెలిచామన్నది మాత్రమే కాకుండా, ఎక్కడ విజయం సాధించామన్నది కూడా ముఖ్యమని వ్యాఖ్యానించారు. బీజేపీకి బలమైన పట్టున్న ప్రాంతాల్లో ప్రతిపక్షాలు సాధించిన విజయాలు ఆ పార్టీకి ప్రజల్లో ఉన్న మద్దతుపై చర్చకు దారితీస్తున్నాయని అన్నారు. నాగ్‌పూర్, వారణాసి, పాట్నా వంటి ప్రాంతాల్లో ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ బీజేపీ అగ్రనేతలు తమ రాజకీయ స్థితిగతులపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. బీజేపీ కంచుకోటల్లో ప్రతిపక్షాలు సాధించిన విజయాలు ప్రజల్లో మారుతున్న రాజకీయ అభిప్రాయాలకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో జరిగిన ఎన్నికలు, వాటి ఫలితాలపై అధికారిక వివరాల ఆధారంగా మాత్రమే తుది నిర్ధారణకు రావాలని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ బీజేపీకి బలమైన పట్టున్న ప్రాంతంలో తమ పార్టీ సత్తా చాటిందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. వారణాసిలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు విజయం సాధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో బీజేపీ పరిస్థితిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంతి సింగ్ అవినాష్ కుమార్‌పై మెజారిటీతో గెలిచారని, పాట్నా ప్రాంతంలోనూ ప్రతిపక్ష అభ్యర్థి విజయం సాధించారని పేర్కొన్నారు. పుణెలో ఎన్సీపీ అభ్యర్థి హర్షత్ దేశ్‌ముఖ్ గెలుపును కూడా ప్రస్తావించారు. గోరఖ్‌పూర్‌లో బీజేపీ సాధించిన విజయంపై వ్యాఖ్యానిస్తూ, అక్కడి ఫలితాలు ఆ పార్టీకి ఎదురవుతున్న రాజకీయ సవాళ్లను సూచిస్తున్నాయని అన్నారు. నాగ్‌పూర్, వారణాసి, గోరఖ్‌పూర్ వంటి ప్రాంతాల్లో రాజకీయ పరిణామాలపై ప్రధాని నైతిక బాధ్యతతో స్పందించాలని డిమాండ్ చేశారు.యువతలో మోదీ ప్రభుత్వ పాలనపై అసంతృప్తి పెరుగుతోందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

సన్న బియ్యం పేరుతో కల్తీ దందా!

మొదటిపేజీ తరువాయి.. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు కూడా రాజేశ్ కుమార్ సింగ్‌ను సంజయ్ జాజు ఆహ్వానించారు. ఈ సదస్సులో భాగంగా రక్షణ ప్రదర్శనను నిర్వహించనున్నారు. రక్షణ రంగానికి సంబంధించిన పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అవకాశాలను పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. తెలంగాణలో ఇప్పటికే అందుబాటులో ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పరిశోధన సామర్థ్యాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను వినియోగించుకుని మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.రక్షణ ప్రదర్శన ద్వారా తెలంగాణలోని విమానయాన, అంతరిక్ష, రక్షణ పరిశ్రమల సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రక్షణ పరికరాల తయారీ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ వేదిక ద్వారా వివరించనున్నారు. దేశీయంగా రక్షణ పరికరాల తయారీని పెంపొందించాలన్న భారత ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణకు అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. అంతర్జాతీయ సంస్థలు, దేశీయ పారిశ్రామిక సంస్థల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించడం ద్వారా కొత్త పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రపంచ పెట్టుబడుల సదస్సు ద్వారా వివిధ దేశాలకు చెందిన పెట్టుబడిదారులను తెలంగాణకు ఆహ్వానించి, పారిశ్రామిక భాగస్వామ్యాలను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రక్షణ రంగంతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విమానయాన పరిశ్రమలు, తయారీ రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని వివరించనున్నారు. రక్షణ ప్రదర్శనను సదస్సులో భాగంగా నిర్వహించడం వల్ల ఈ రంగాలకు చెందిన సంస్థలకు తమ ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడి ప్రణాళికలను ప్రదర్శించే అవకాశం లభించనుంది. దీనివల్ల రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలున్నాయి.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

మొదటిపేజీ తరువాయి.. అనంతరం ఈటల రాజేందర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. డంపింగ్ యార్డు సమస్యను రాజకీయ విమర్శల కోణంలో కాకుండా ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు సంబంధించిన అంశంగా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పిల్లల భద్రతపైనా ఆందోళనలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని నమ్మి ఓట్లు వేసి గెలిపించిన తర్వాత వారి ఇబ్బందులను పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. నిచ్చెన మెట్లలా ప్రజలను అవసరానికి ఉపయోగించుకుని వదిలేయవద్దని ముఖ్యమంత్రికి హితవు పలికారు. తెలంగాణ ప్రజలు ఒకసారి ఆదరించిన వారిని మర్చిపోరని, అదే విధంగా తమ కష్టాలను తీర్చని పాలకులను కూడా ప్రశ్నిస్తారని వ్యాఖ్యానించారు. లక్షలాది మంది జీవితాలకు సంబంధించిన ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమనే నమ్మకంతోనే తాను పాదయాత్ర ప్రారంభించానని ఈటల రాజేందర్ తెలిపారు. డంపింగ్ యార్డును తొలగించేందుకు సుమారు రూ.2 వేల కోట్లు ఖర్చు చేయలేని ప్రభుత్వం, మూసీ నది ప్రక్షాళనకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయగలదా అని ప్రశ్నించారు. అయితే ప్రజలకు ఉపయోగపడే పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. చెత్తను కేవలం వ్యర్థంగా చూడకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సంపదగా మార్చే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో చెత్త నుంచి ఉపయోగకరమైన ఉత్పత్తులను తయారు చేస్తున్నారని, సరైన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ నిర్వహణతో వ్యర్థాలను సమర్థంగా పునర్వినియోగం చేయవచ్చని పేర్కొన్నారు. ఒక్క గ్రాము చెత్త కూడా వృథా కాకుండా నిర్వహించే విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. డంపింగ్ యార్డు నిర్వహణలో రాంకీ సంస్థ పనితీరుపైనా ఆయన విమర్శలు చేశారు. ఆర్థిక అంశాలకే ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజల ఆరోగ్యాన్ని ప్రధానంగా పరిగణించాలని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న కలుషిత నీరు పరిసర ప్రాంతాల్లోని చెరువులు, భూగర్భ జలాలపై ప్రభావం చూపుతోందని ఈటల రాజేందర్ ఆరోపించారు. లీచేట్ అని పిలిచే చెత్త నుంచి వెలువడే కలుషిత ద్రవం కారణంగా చెరువులు కలుషితమయ్యాయని, కొన్ని ప్రాంతాల్లో బోర్ల నుంచి పచ్చటి రంగులో నీరు వస్తోందని స్థానికుల సమస్యలను ప్రస్తావించారు. ఈ నీటి నాణ్యతపై సంబంధిత శాఖలు శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి ప్రజలకు వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని, కాలుష్య సమస్యకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీటి భద్రత, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డంపింగ్ యార్డు వల్ల ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను సమగ్రంగా అధ్యయనం చేసి, ప్రభావిత ప్రాంతాలకు అవసరమైన వైద్య, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల జీవితాలతో చెలగాటమాడవద్దని వ్యాఖ్యానిస్తూ, ఈ సమస్య పరిష్కారానికి కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

మెడికవర్ ఘటనపై మానవ హక్కుల కమిషన్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి.. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో జూనియర్ న్యాయవాది కారుపోతుల ఐశ్వర్య మృతి ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారానికి సంబంధించి తెలంగాణ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌కు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఘటనపై తగిన చర్యలు తీసుకుని నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. యువ న్యాయవాది మృతి వెనుక ఉన్న పరిస్థితులు, ఆసుపత్రిలో అందించిన వైద్యసేవలు, శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై స్పష్టత తీసుకురావాలన్న డిమాండ్ల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. న్యాయవాది కారుపోతుల రేవంత్ చేసిన ఫిర్యాదు ఆధారంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఈ అంశాన్ని పరిశీలనకు తీసుకున్నట్లు తెలిసింది.వివరాల ప్రకారం, 28 ఏళ్ల ఐశ్వర్య కిడ్నీలో రాళ్ల సమస్యకు చికిత్స పొందేందుకు సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. కిడ్నీలో రాళ్ల తొలగింపునకు శస్త్ర చికిత్స నిర్వహించిన అనంతరం ఆమె మృతి చెందడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదానికి గురిచేసింది. సాధారణ చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లిన యువతి ప్రాణాలు కోల్పోవడంతో మృతికి దారితీసిన పరిస్థితులపై పలు ప్రశ్నలు తలెత్తాయి. శస్త్రచికిత్సకు ముందు ఆమె ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది, చికిత్స సమయంలో ఏవైనా సమస్యలు ఎదురయ్యాయా, శస్త్ర చికిత్స అనంతరం ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. వైద్యపరమైన కారణాలు, చికిత్స వివరాలు అధికారికంగా వెల్లడైన తర్వాతే ఘటనపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఐశ్వర్యకు శస్త్రచికిత్స నిర్వహించాల్సిన అవసరం ఎంతవరకు ఉందనే అంశంతో పాటు, చికిత్స వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి కుటుంబ సభ్యులకు వివరించారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శస్త్రచికిత్సకు ముందు రోగి లేదా కుటుంబ సభ్యుల నుంచి అవసరమైన సమ్మతి తీసుకున్నారా, చికిత్సకు సంబంధించిన ప్రయోజనాలు, ప్రమాదాలను వివరించారా అనే విషయాలపై వారు స్పష్టత కోరుతున్నారు. అయితే ఇవి కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్న అనుమానాలేనని, వైద్యపరమైన నిర్లక్ష్యం జరిగిందని నిర్ధారించడానికి సంబంధిత రికార్డులు, నిపుణుల పరిశీలన, అధికారిక విచారణ అవసరమని గుర్తించాలి. ఆసుపత్రిలో నిర్వహించిన చికిత్సకు సంబంధించిన పత్రాలు, శస్త్రచికిత్స వివరాలు, రోగి ఆరోగ్య పరిస్థితిపై నమోదైన సమాచారాన్ని పరిశీలించడం ద్వారా వాస్తవాలను వెలికితీయవచ్చు. జాతీయ మానవ హక్కుల కమిషన్ జారీ చేసిన నోటీసుల నేపథ్యంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ, పోలీసు విభాగం స్పందన కీలకంగా మారింది. వైద్య చికిత్స సమయంలో రోగుల హక్కులు పరిరక్షించబడ్డాయా, అవసరమైన వైద్య ప్రమాణాలు పాటించారా, ఘటనకు సంబంధించిన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలపై నివేదికలో వివరాలు ఉండాల్సి ఉంటుంది. నాలుగు వారాల గడువులో సంబంధిత అధికారులు సమాచారాన్ని సేకరించి కమిషన్‌కు సమర్పించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆసుపత్రి వైద్య రికార్డులు, చికిత్సకు సంబంధించిన వివరాలు, కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదులు, పోలీసుల దర్యాప్తు పురోగతి వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. విచారణ నిష్పక్షపాతంగా సాగి, వాస్తవాలు వెలుగులోకి రావాలని బాధిత కుటుంబం ఆశిస్తోంది.

నీటి వృథాను అరికట్టండి : మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి.. నీరు మనందరి ఉమ్మడి సంపదని, భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే నీటి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం తమ రోజువారీ నీటి వినియోగాన్ని కనీసం 20 శాతం తగ్గించుకోవాలని సూచించారు. ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. నీటి వృథాను అరికట్టడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ప్రజలందరి బాధ్యతని స్పష్టం చేశారు.నీటి సంరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా హైదరాబాద్ జల మండలి పానీ మొబైల్ యాప్ (వాటర్ వారియర్స్)ను అందుబాటులోకి తీసుకొచ్చిందని మంత్రి వెల్లడించారు. జలమండలి ప్రధాన కార్యాలయంలో ఈ యాప్‌ను ఆవిష్కరించిన కార్యక్రమంలో ఎండీ అశోక్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల్లో నీరు వృథాగా ప్రవహిస్తున్నా, నీటి సరఫరా పైపుల నుంచి లీకేజీలు జరుగుతున్నా వాటిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. నీటి వృథాను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు.ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, భవిష్యత్తులో తాగునీటికి పెరగనున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరులను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇంటి అవసరాలకు అవసరమైనంత నీటినే వినియోగించాలని, కుళాయిలను నిర్లక్ష్యంగా తెరిచి ఉంచడం, పైపుల లీకేజీలను పట్టించుకోకపోవడం వంటి కారణాలతో విలువైన నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి పొదుపు అలవాటును ప్రతి కుటుంబం రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినప్పుడే నీటి సంరక్షణ కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా అమలవుతాయని తెలిపారు.

టామ్‌కామ్ పేరిట నిరుద్యోగుల నుంచి వసూళ్లు!

మొదటిపేజీ తరువాయి.. టామ్‌కామ్ పేరిట విదేశీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మోసానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ స్వేరో ఆరోపించారు. జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తామని, వాటికి అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ అందిస్తామని టామ్‌కామ్ ఇటీవల ప్రకటనలు విడుదల చేయగా, వాటిని నమ్మి వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే, ఉచితంగా కల్పించాల్సిన అవకాశాల కోసం ఒక్కో అభ్యర్థి నుంచి రూ.4.10 లక్షలు వసూలు చేశారని ఆయన ఆరోపించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించాలనే ఆశతో ముందుకు వచ్చిన యువత నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.టామ్‌కామ్ ద్వారా జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిన తర్వాత పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ స్వేరో పేర్కొన్నారు. విదేశాల్లో ఉపాధి పొందాలనే లక్ష్యంతో అభ్యర్థులు అవసరమైన పత్రాలు సమర్పించి, నియామక ప్రక్రియలో పాల్గొన్నారని తెలిపారు. ఈ అవకాశాలను ఉపయోగించుకునేందుకు ఒక్కొక్కరు లక్షల రూపాయలు చెల్లించాల్సి వచ్చిందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన సంస్థలే వారి నుంచి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

కరువులో మూసీ సుందరీకరణ ఎందుకు?

మొదటిపేజీ తరువాయి.. కాపాడుకోవడానికి రైతులు జనరేటర్లు, ట్యాంకర్లపై ఆధారపడుతున్నారని, కొన్ని ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని రంగాల్లోనూ సమస్యలు పెంచుతున్న ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెప్పాలని వ్యాఖ్యానించారు.ఎన్నికలకు ముందు రైతు డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు రైతులే తమ పంటలను కాపాడుకోవాల్సిన పరిస్థితి తీసుకొచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతులు తమ పంటలను తామే రక్షించుకుంటామని స్వీయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. సాగునీటి కొరత, విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని కోరారు.ఒకవైపు రాష్ట్రంలో కరువు పరిస్థితులు, తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని చెబుతూనే మరోవైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు రూ.1,50,000 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం భావించడం సమంజసం కాదని కేటీఆర్ అన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక లేకుండానే భారీ వ్యయంతో పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారని ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు పేరుతో ప్రజాధనం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టును వెంటనే నిలిపివేసి, ఆ నిధులను రైతుల ఉపశమనానికి, తాగునీటి సమస్యల పరిష్కారానికి, ప్రజా సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. మూసీ సుందరీకరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో బాధితులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశం కల్పించలేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆమోదం, బాధితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి భారీ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్న సమయంలో మూసీ సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రాజెక్టు వ్యయం, ప్రయోజనాలు, ప్రజలపై పడే ప్రభావం వంటి అంశాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అయితే, ప్రాజెక్టు వ్యయం, నివేదికల స్థితి, ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వ వివరణ ఈ ప్రకటనలో లేదు. కరువు పరిస్థితుల్లో ప్రపంచ పెట్టుబడుల సదస్సు నిర్వహించడంపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. విద్యుత్, నీటి కొరతతో పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెబుతూ, ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారులను ఎలా ఆకర్షిస్తారని ప్రశ్నించారు. గత మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టిన విదేశీ పర్యటనలు, ప్రకటించిన అవగాహన ఒప్పందాలు, పెట్టుబడుల సదస్సుల ద్వారా వచ్చిన పెట్టుబడుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- **జిల్లా ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యం**
- **పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**





హనుమకొండ, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు వడ్డేపల్లి చెరువు బండ్‌పై చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్నతో కలిసి వడ్డేపల్లి చెరువు బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బండ్ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రక్షణ గోడ నిర్మాణం, గ్రిల్స్ ఏర్పాటు, టైల్స్ పనులు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, రంగులు వేయడం, వ్యాయామ పరికరాల ఏర్పాటు, ప్రహరీ గోడ నిర్మాణం తదితర పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. బండ్ బిగువన ఏర్పాటు చేస్తున్న ఆహార విక్రయ కేంద్రాల వద్ద కూర్చునేందుకు అవసరమైన సదుపాయాలు, గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు, పచ్చదనం పెంపు, పిల్లల ఆట స్థలం వద్ద కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆహార విక్రయ కేంద్రాలకు ఆకర్షణీయమైన రంగులు వేయించేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బండ్ పరిసరాలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేలా మొక్కలు నాటాలని, విద్యుత్ దీపాల ఏర్పాటు సహా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఆహ్లాదంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పర్యవేక్షక ఇంజినీర్ రాజ్ కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

- **ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ముప్పు.. నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలి**
- **గోపాలపూర్‌లో రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల అవగాహన**



ఎల్కతుర్తి, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. నీటి వనరులు సరిపోని ప్రాంతాల్లో పంటలు సాగు చేసి పెట్టుబడులు నష్టపోయే బదులు, పరిస్థితులను అంచనా వేసుకొని సాగుపై నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘కేత్ బచావో అభియాన్’ (సాగుభూమి సంరక్షణ) కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం. రాజ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. పున్నం చందర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కొంతమేర నీటి వసతి ఉన్న రైతులు పెసర, మినుము, శనగ వంటి పప్పుధాన్యాలతో పాటు వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ, నువ్వులు, ఆముదం వంటి నూనెగింజల పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యతను బట్టి కూరగాయల సాగును కూడా ఎంచుకోవచ్చని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, భూగర్భజలాల లభ్యత, అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిశీలించిన తర్వాతే పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్, పశువుల సంరక్షణపై సూచనలు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం, సరఫరా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ సుధాకర్ వివరించారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత, పశుగ్రాస కొరత వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల పశువైద్య అధికారి రవీందర్ రెడ్డి వివరించారు. పశువులకు తగినంత నీరు అందించడం, సామూహిక నీటి తొట్లను ఏర్పాటు చేయడం, సమష్టిగా పశుగ్రాసం పెంపకం చేపట్టడం వంటి చర్యల ప్రాధాన్యతను వివరించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధి రఘు సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పాటించాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. ఆయిల్‌పామ్ సాగు విధానాలు, పంట నిర్వహణపై కూడా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రె లక్ష్మి, ఉపసర్పంచ్ సందీప్, సాగు మిత్ర సొసైటీ చైర్మన్ గడ్డం లక్ష్మీనారాయణ, విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ సుధాకర్, మండల పశువైద్య అధికారి రవీందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరిన తాడ్వాయి మండల కాంగ్రెస్ నాయకులు

- **నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ‘తెలంగాణ గళం.. బలం’ కార్యక్రమం**
- **మేడారం సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు**



ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న ‘ఛలో ఢిల్లీ – తెలంగాణ గళం.. బలం’ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం బయలుదేరారు. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో నాయకులు ఢిల్లీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఢిల్లీకి బయలుదేరే ముందు మేడారంలోని శ్రీ సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని, రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఎన్నికల అక్రమాలపై నిరసనఎన్నికల సమయంలో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై నిరసన తెలియజేయడంతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను ఎండగడుతూ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ ప్రజల గళాన్ని, బలాన్ని చాటడంతో పాటు రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ బొల్లు దేవేందర్ ముదిరాజ్, మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అరెం లచ్చు పటేల్, సహకార సంఘం మాజీ చైర్మన్ పులి సంపత్ గౌడ్, జీసీ సెల్ మండల అధ్యక్షుడు యాషాడపు మల్లయ్య, జిల్లా నాయకుడు తాండాల శ్రీను, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోడి సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ బెజ్జూరి శ్రీనివాస్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు భూషబోయిన రవికుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మర్రి నరేష్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గొంది సరిత, సింగిల్ విండో డైరెక్టర్ ఆకుల సమ్మయ్య గౌడ్, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంట సాయి రెడ్డి, మండల నాయకులు రాపోలు సంజీవ రెడ్డి, కోట సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- **54వ డివిజన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన**



హనుమకొండ, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్‌లో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కురుమిళ్ల సదానందం, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పోట్లశ్రీరాము, భారతీయ జనతా యువమోర్చా జిల్లా కార్యదర్శి తాడిశెట్టి రాహుల్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కొడపాక స్రవంతి, 14వ బూత్ అధ్యక్షుడు కానిగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించేందుకు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దామెర గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరిక

- **మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలోకి ఆహ్వానం**



ఎల్కతుర్తి, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన కందికొండ కోటిలింగం, పాండ్రాల సదానందం భారతీయ జనతా పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో నూతనంగా చేరిన నాయకులు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు అల్లికుమార్, చిదురల వెంకటేష్, ఉపాధ్యక్షుడు అంబ్బీర్ శ్రీనివాస్, దామెర శక్తి కేంద్ర ఇన్‌చార్జి ఠాకూర్ శాంసింగ్, సాతూరి ప్రభాకర్, చల్ల రవీందర్ రెడ్డి, మంతుర్తి సమ్మయ్య, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ పండ్రాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు

హసన్‌పర్తి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంపై కృతజ్ఞతలు



హనుమకొండ ,అక్టోబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి): హసన్‌పర్తి మండలాన్ని కరువు మండలంగా ప్రత్యేకంగా గుర్తించి ప్రకటించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి, వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజుకు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీసం సురేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు అవసరమైన కనీస సదుపాయాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

విద్యార్థులకు అవసర వస్తువుల పంపిణీలో లోటుపాట్లు ఉండకూడదు

- ప్రతి విద్యార్థికి 21 రకాల వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



ఏటూరునాగారం, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన అవసర వస్తువుల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థికి అన్ని రకాల వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని మండల వనరుల కేంద్రాన్ని సందర్శించిన ఆయన, ఎస్సీ, ఎస్టీ, జీసీ వర్గాలకు చెందిన హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న వస్తువులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాం వస్త్రాలు, గుర్తింపు కార్డులు, బెల్టులు, నల్ల బూట్లు, తెల్ల బూట్లు, సాక్సులు, ట్రాక్ షూస్, పాఠశాల సంచులు, పరుపు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ పెట్టెలు, దుప్పట్లు, రాత్రి దుస్తులు తదితర 21 రకాల వస్తువుల పంపిణీ వివరాలను పరిశీలించారు.ప్రతి విద్యార్థికి అవసరమైన వస్తువులన్నీ అందుతున్నాయో లేదో రికార్డులతో సరిపోల్చి ధ్రువీకరించాలని పీఓ సూచించారు. పంపిణీలో ఎలాంటి అవకతవకలు, నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా పర్యవేక్షించాలని, అర్హులైన విద్యార్థులందరికీ వంద శాతం వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం మండల విద్యాశాఖ అధికారి మల్లయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్‌లో పేదల ఇళ్ల కూల్చివేత తగదు!

- ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చడం అన్యాయం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి



హనుమకొండ, అక్టోబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి): కాజీపేట పరిధిలోని వైఎస్సార్ నగర్ కాలనీలో పేదలు నివాసముంటున్న ఇళ్లను, నిర్మాణాలను అధికారులు కూల్చివేయడంపై బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా నివాసముంటున్న పేద కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చివేయడం సమంజసం కాదని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా రావు పద్మారెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ నగర్ కాలనీలో పేద కుటుంబాలు దాదాపు 30 ఏళ్లుగా నివాసముంటున్నాయని తెలిపారు. రెక్కలు ముక్కలు చేసుకుని, రాత్రింబవళ్లు కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను ఉన్నపళంగా నేలమట్టం చేయడం వల్ల నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల నివాసాలను కూల్చివేసే చర్యలను అధికారులు తక్షణమే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయడంతో పాటు, వారి నివాస సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. వైఎస్సార్ నగర్ బాధిత కుటుంబాలకు బీజేపీ అండగా ఉంటుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేస్తామని రావు పద్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాలకుర్తి కాంగ్రెస్ రైతు కిసాన్ సెల్ అధ్యక్షుడిగా పెంతల మైపాల్ రెడ్డి

- నూతన అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పాలకుర్తి, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): జనగామ జిల్లా పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ రైతు కిసాన్ సెల్ అధ్యక్షుడిగా వావిలాల గ్రామానికి చెందిన పెంతల మైపాల్ రెడ్డి నియమితులయ్యారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆయనను అధ్యక్షుడిగా నియమించి, శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, బాధ్యతలు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు పెంతల మైపాల్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి, మండల నాయకులకు, కార్యకర్తలకు, స్నేహితులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మూడు నెలలకే మరమ్మతులకు గురైన సీసీ రోడ్డు!

- నిర్మాణ నాణ్యతపై అనుమానాలు.. అధికారుల నిర్లక్ష్యంపై స్పందించాలి
- ఏటూరునాగారం–ఎక్కెళ్ల రహదారిని పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం నేత ఎం.డి. దావూద్



ఏటూరునాగారం, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజాధనంతో నిర్మించిన సీసీ రోడ్డు మూడు నెలలకే మరమ్మతులకు గురికావడంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. దావూద్ డిమాండ్ చేశారు. ఏటూరునాగారం నుంచి ఎక్కెళ్ల గ్రామానికి వెళ్లే రహదారిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలల కిందటే నిర్మించిన సీసీ రోడ్డు దెబ్బతినడం, తిరిగి దానిపై తారు వేయాల్సిన పరిస్థితి ఏర్పడటం నిర్మాణ నాణ్యతపై అనుమానాలకు తావిస్తోందని అన్నారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే ప్రజాధనం వృథా కావడంతో పాటు ప్రజలు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. పనులను పర్యవేక్షించిన అధికారులు బాధ్యతగా వ్యవహరించి, నిర్మాణ నాణ్యతపై విచారణ చేపట్టాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు విద్యార్థులు, రైతులు, కూలీలు, ఇతర ప్రజల రాకపోకలకు ఎంతో కీలకమని తెలిపారు.ఏటూరునాగారం–ఎక్కెళ్ల రహదారిని వెంటనే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, రోడ్డు నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎం.డి. దావూద్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గొంది రాజేష్, జజ్జర దామోదర్, రవి, మండల నాయకులు తోలం కృష్ణయ్య, రవితేజ, బాలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. ఇంటి వద్దకు చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా?

- ప్రజలతో నేరుగా మాట్లాడిన వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ వెంకన్న
- పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి.. అగ్నిమాపక నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



హనుమకొండ,అక్టోబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి): నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత పకడ్బందీగా చేపట్టి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించిన ఆయన పారిశుధ్య పనులు, వీధి కుక్కల నియంత్రణ చర్యలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఇంటి వద్దకే చెత్త సేకరణపై ఆరా

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కమిషనర్ ఇళ్ల వద్దకు వెళ్లి స్థానికులతో నేరుగా మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ ఇంటి వద్దకు వచ్చి చెత్త సేకరిస్తున్నారా? పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది? అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందనను సేకరించి, చెత్త సేకరణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

నగరంలో వీధి కుక్కల బెడదను తగ్గించేందుకు వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను మరింత విస్తృతంగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు హసన్‌పర్తిలోని కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న శస్త్రచికిత్సల విధానాన్ని పరిశీలించారు.

అగ్నిమాపక భద్రతపై తనిఖీలు

ములుగు రోడ్డులోని ఆసుపత్రి, కిడ్స్ కళాశాలలో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ ప్రధాన వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజారెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రాజేశ్వర్‌రావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం కమ్యూనికేషన్ నైపుణ్యాల పుస్తకం

- వాగ్దేవి కళాశాలల చైర్మన్ డా. దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా 'ఇంజినీరింగ్ కమ్యూనికేషన్ అండ్ లాంగ్వేజ్ స్కిల్స్' ఆవిష్కరణ



వరంగల్, అక్టోబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి): ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కేడల కరుణశ్రీ రచించిన 'ఇంజినీరింగ్ కమ్యూనికేషన్ అండ్ లాంగ్వేజ్ స్కిల్స్' పుస్తకాన్ని వాగ్దేవి కళాశాలల చైర్మన్ డా. సీహెచ్ దేవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఆంగ్లంలో సమర్థవంతంగా మాట్లాడటం, తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడం, సమూహ చర్చల్లో పాల్గొనడం, ఉద్యోగ ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం, ప్రదర్శనల ద్వారా తమ అభిప్రాయాలను వివరించడం వంటి వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల భాషా పరిజ్ఞానంతో పాటు ఉద్యోగావకాశాలకు అవసరమైన కమ్యూనికేషన్ సామర్థ్యాలను మెరుగుపరచడంలో ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డా. కరుణశ్రీని చైర్మన్ డా. దేవేందర్‌రెడ్డి అభినందించారు. అధ్యాపక వృత్తితో పాటు కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాన్ని రచించడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో విద్యా, పరిశోధనా రంగాలకు మరిన్ని విలువైన రచనలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా. కరుణశ్రీ తండ్రి, ఖిలా వరంగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు కేడల జనార్ధన్, తల్లి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, భర్త, వరంగల్ తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నగర అధ్యక్షుడు శంకేసి రాజేష్ పాల్గొన్నారు. తన తల్లిదండ్రులు, భర్త సమక్షంలో పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని డా. కరుణశ్రీ తెలిపారు. డా. కరుణశ్రీ రచించిన ఈ పుస్తకం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి అంతర్జాల విక్రయ వేదికల్లో అందుబాటులో ఉందని నిర్వాహకులు వెల్లడించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అర్నబ్ తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి!

- **సాంస్కృతిక కళాజాత ద్వారా గ్రామస్తులకు అవగాహన**
- **నీటిని పొదుపు చేయాలి.. విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి**



ఏటూరునాగారం, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వాతావరణ మార్పుల నేపథ్యంలో అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు సూచించారు. ములుగు జిల్లా కలెక్టర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో గురువారం ఏటూరునాగారం మండలం చింతలమోరి గ్రామంలో పాటల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడం, వరదలు సంభవించడం, చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు విరిగిపడటం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కళాబృందం సభ్యులు ప్రజలకు వివరించారు. వర్షాలు, వరదల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడిన చోట్లకు వెళ్లకూడదని, విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వినియోగించాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా వర్షపు నీటిని వృథా చేయకుండా ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని, నీటిని పొదుపుగా వాడుతూ జల సంరక్షణ చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పాటల రూపంలో వివరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ములుగు జిల్లా సమన్వయకర్త రాగుల శంకర్, మార్త రవి, రహీముద్దీన్, బోడ కిషన్, రేలా విజయ్‌కుమార్, అమ్మపాట తిరుపతి, గోల్కొండ నరేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలి**
- **ఎంపీడీవో తేజ, కాటాపురం సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు పిలుపు**



ములుగు జిల్లా/తాడ్వాయి,అక్టోబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి):భూగర్భ జలాలను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, భవిష్యత్తులో నీటి కొరతను నివారించేందుకు ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని తాడ్వాయి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) తేజ సూచించారు. ఈ మేరకు కాటాపురం గ్రామపంచాయతీని సందర్శించిన ఆయన భూగర్భ జలాల పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులు, నీటి లభ్యతలో ఏర్పడుతున్న వ్యత్యాసాల నేపథ్యంలో భూగర్భ జలాలను కాపాడుకోవడం అత్యంత అవసరమని ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, నీటి ఇంకుడు గుంతలు (సోక్‌పిట్స్) నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటే భూగర్భ జలమట్టాలు పెరిగేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కాటాపురం గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ, గ్రామంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నీటి వృథాను అరికట్టి భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని కోరారు. గ్రామంలో నీటి సంరక్షణ చర్యలను ప్రజల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు రాసురి సంజీవ, తడక హరీష్, సయ్యద్ వహీదు హుస్సేన్, గండు భిక్షపతి, పల్నాటి రామ్మూర్తి, మెడిశెట్టి మోహన్‌రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలి!

- **ఈవీఎంలను రద్దు చేసి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించేందుకు సిద్ధమా?**
- **నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలుపుతో బీజేపీలో భయం: డా. పెరుమాండ్ల రామకృష్ణ**



హైదరాబాద్, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి):ఎన్నికల నిర్వహణలో పారదర్శకతపై భారతీయ జనతా పార్టీకి నిజమైన చిత్తశుద్ధి ఉంటే, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలను) రద్దు చేసి రాబోయే లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించేందుకు సిద్ధమని ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డా. పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించబడ్డాయని పేర్కొంటూ, బ్యాలెట్ పేపర్లపై నమ్మకం ఉందని చెబుతున్న బీజేపీ నాయకులు ఈవీఎంల విషయంలోనూ తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరిగితే ఫలితాలను అంగీకరిస్తామని చెప్పే బీజేపీ, అదే విధానాన్ని లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేసేందుకు సిద్ధమా? అని రామకృష్ణ ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అనుమానాలు లేకుండా, ప్రతి ఓటరు తన ఓటు భద్రంగా ఉందనే విశ్వాసాన్ని కల్పించడం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమని అన్నారు. నాగ్‌పూర్ ఆర్ఎస్ఎస్‌కు బలమైన కేంద్రంగా ఉన్న నేపథ్యంలో అక్కడ కాంగ్రెస్ సాధించిన విజయంతో బీజేపీ ఆందోళనకు గురవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై వివిధ ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్న రామకృష్ణ, వాటిపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అన్నదానికంటే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండటం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈవీఎంలపై తమకు పూర్తి నమ్మకం ఉందని చెబుతున్న బీజేపీ నాయకులు, బ్యాలెట్ పేపర్లతో ఎన్నికల నిర్వహణ అంశంపై తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని డా. పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ దృష్టి



పర్వతగిరి, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీఆర్ఎస్ పార్టీ నాయకులకు సూచించారు. గురువారం పర్వతగిరి మండల కేంద్రంలో పార్టీ మండల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి, ఓటరు నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి, ఓటరుగా నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులు ఎవరూ ఓటు హక్కును పొందే అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పర్వతగిరి మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికే మండల సర్వసభ్య సమావేశాలు

- **అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించుకోవాలి**
- **ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు**



ఏటూరునాగారం, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికే మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నామని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండల తహసీల్దార్ గుర్రం జగదీష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు హాజరయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వ్యవసాయం, తాగునీరు, సాగునీటి అవసరాలు, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి వినియోగంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని సమావేశంలో సూచించారు. తాగునీరు, సాగునీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. పశువులకు నీటి కొరత ఏర్పడకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని, విద్యుత్‌ను అవసరమైన మేరకే వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ, వ్యవసాయశాఖ, సమగ్ర శిశు అభివృద్ధి సేవల విభాగం, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, మహిళా సమాఖ్య, విద్యుత్, ఇంజినీరింగ్, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భూ పునఃసర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి

- **అధికారులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం**
- **సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ.. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష**



పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): భూ పునఃసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయంలోని రికార్డులు, భూ భారతి కింద అందిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. భూ పునఃసర్వే మొదటి విడతలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనులకు ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూ భారతి కింద అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, గడువు దాటిన దరఖాస్తులు లేకుండా చూడాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో శిక్షణలో ఉన్న ఉప కలెక్టర్ వనజ, సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గ్రావెల్ అనుమతులకు కొత్త పోర్టల్.. ప్రక్రియ మరింత సులభతరం

- ఐదు రోజుల నుంచి వారంలోపు అనుమతులు మంజూరు చేసేలా వ్యవస్థ రూపకల్పన
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రావెల్ (మట్టి) తరలింపునకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమగ్ర గ్రావెల్ నిర్వహణ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. ఈ విధానం కోసం ప్రత్యేకంగా నూతన అంతర్జాల వేదికను రూపొందిస్తున్నామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో మైనింగ్, రెవెన్యూ, సాంకేతిక శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కొత్త విధానం అమలు, అంతర్జాల వేదిక పనితీరు, అనుమతుల జారీ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారుల నిర్మాణం, రైతులు, ప్రజల అవసరాల కోసం గ్రావెల్ తరలించేందుకు అనుమతులు పొందే ప్రక్రియను సరళీకృతం చేయడమే కొత్త విధానం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. చిన్న మొత్తాల్లో గ్రావెల్ అవసరమైన సందర్భాల్లోనూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని త్వరగా అనుమతులు పొందే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సాధ్యమైనంత త్వరగా, సుమారు ఐదు రోజుల నుంచి వారం రోజుల్లోపు అనుమతులు మంజూరు చేసేలా వ్యవస్థను రూపొందిస్తున్నామని వివరించారు. కొత్త అంతర్జాల వేదికకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) అభివృద్ధి చేయనుందని కలెక్టర్ తెలిపారు. ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు సీజీజీ సాంకేతిక బృందం శనివారం జిల్లాకు రానుందని చెప్పారు. రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులకు విధివిధానాలను వివరించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం పోర్టల్‌ను త్వరగా వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు గ్రావెల్ తరలించే వాహనాల వివరాలను నమోదు చేయడంతో పాటు, వాహనాలు గ్రామంలోకి ప్రవేశించిన సమయం, బయటకు వెళ్లిన సమయాన్ని పోర్టల్‌లో పొందుపరుస్తారని కలెక్టర్ వివరించారు. ఈ విధానం ద్వారా అనధికార గ్రావెల్ తవ్వకాలు, తరలింపును నియంత్రించడంతో పాటు, గ్రామాల్లో చిన్నపాటి అభివృద్ధి పనులకు అవసరమైన గ్రావెల్ పొందడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా గనుల శాఖ సహాయ సంచాలకుడు రామాచారి, హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారులు వెంకటేష్, డీఎస్ వెంకన్న, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీధర్, సీ-సెక్షన్ పర్యవేక్షకుడు చల్లా ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం

- వరంగల్ ఇన్‌చార్జిగా యుగేందర్ గౌడ్ నియామకం



వరంగల్ ,అక్టోబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేయనున్నట్లు పార్టీ అధ్యక్షుడు ఈడ శేషగిరిరావు గౌడ్ తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి వరంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా యుగేందర్ గౌడ్‌ను నియమించినట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు

అసంపూర్తి పనులకే ప్రారంభోత్సవమా?

- వెంకటాపూర్ ఎస్సీ కాలనీలో పూర్తికాని సైడ్ డ్రైన్ పనులకు మంత్రి సీతక్క ప్రారంభోత్సవం
- ఇరువైపులా మట్టి నింపకుండానే వదిలేశారని కాలనీవాసుల విమర్శలు



వెంకటాపూర్ (రామప్ప), అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రైన్ పనులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క గురువారం ప్రారంభోత్సవం చేయడంపై కాలనీవాసులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయ్యాయా లేదా అన్నది పరిశీలించకుండానే శిలాఫలకాన్ని ఆర్భాటంగా ప్రారంభించడం విడ్డూరంగా ఉందని వారు పేర్కొంటున్నారు.

కాలనీవాసుల కథనం ప్రకారం..
గత మే నెలలో ఎస్సీ కాలనీలో సుమారు వంద మీటర్ల మేర సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టారు. కాలువ తవ్వకాలకు జేసీబీని వినియోగించి, వెలువడిన మట్టిని ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే కాలువకు ఇరువైపులా మట్టి నింపి పటిష్ఠం చేయాల్సిన పనులు మాత్రం పూర్తి చేయకుండా వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పనులు అసంపూర్తిగానే ఉన్నాయని చెబుతున్నారు. మండల పర్యటనలో భాగంగా గురువారం మంత్రి సీతక్క కాలనీలో పర్యటించి, సైడ్ డ్రైన్ పనులు పూర్తయినట్లుగా భావించి శిలాఫలకాన్ని ప్రారంభించారని స్థానికులు విమర్శిస్తున్నారు. కాలువకు ఇరువైపులా మట్టి నింపాలని గతంలో పలుమార్లు కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత సహాయ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనులు పూర్తయ్యాయా లేదా అన్నది సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం లేదా అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.



అసంపూర్తి పనులను పూర్తి చేయించకుండా ప్రారంభోత్సవాలకు ప్రాధాన్యం ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువకు ఇరువైపులా మట్టి నింపి, మిగిలిన పనులను పూర్తి చేయించాలని వారు కోరుతున్నారు.

పంచాయతీరాజ్ శాఖకు రూ.33,688 కోట్లు.. గ్రామ పంచాయతీలకు నేరుగా ఎంత?

- నిధుల విడుదల, ఖర్చులపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు వెల్లడించాలి
- తెలంగాణ గిరిజన సర్పంచుల ఫోరం జనగామ జిల్లా అధ్యక్షుడు కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ డిమాండ్



జనగామ ,అక్టోబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.33,688 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, ఇప్పటివరకు ఎన్ని నిధులు విడుదల చేశారు? ఎంత ఖర్చు చేశారు? గ్రామ పంచాయతీలకు నేరుగా ఎంత మొత్తం అందింది? అనే వివరాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని తెలంగాణ గిరిజన సర్పంచుల ఫోరం జనగామ జిల్లా అధ్యక్షుడు కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ డిమాండ్ చేశారు. శాఖకు చేసిన బడ్జెట్ కేటాయింపులతో పాటు నిధుల విడుదల, వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి ఖర్చు చేసిన మొత్తాలు, వివిధ అభివృద్ధి పనులకు విడుదల చేసిన నిధులు, పెండింగ్ బిల్లుల చెల్లింపుల స్థితిగతులను వెల్లడించాలని సూచించారు. 15వ, 16వ ఆర్థిక సంఘాల నిధులతో పాటు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల పరిస్థితిపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12,700 మందికి పైగా సర్పంచులు తమ తమ జిల్లాలు, మండలాల వారీగా నిధుల కేటాయింపులు, విడుదలలు, ఖర్చుల వివరాలను అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేయాలని కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయించిన మొత్తం నిధులన్నీ నేరుగా గ్రామ పంచాయతీలకు అందవని, వివిధ పథకాలు, గ్రామీణ రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను విడివిడిగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడం మాత్రమే కాకుండా, వాటిని సకాలంలో విడుదల చేసి గ్రామాభివృద్ధి పనులకు వినియోగించినప్పుడే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు, పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ ఐక్యత సందేశంతో 5కే, 10కే వాక్–రన్

- ఈ నెల 31న ఉదయం 6 గంటలకు హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభం
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్

హనుమకొండ, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి); సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ ఐక్యత దినోత్సవం (ఏక్తా దివస్), విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఈ నెల 31న 5కే, 10కే వాక్–రన్ నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు.శనివారం ఉదయం 6 గంటలకు హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. అక్కడి నుంచి మట్టేవాడ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లి, తిరిగి పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు చేరుకోవడంతో వాక్–రన్ ముగుస్తుందని పేర్కొన్నారు.జాతీయ ఐక్యత, ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పురుషులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు పాల్గొనవచ్చని సీపీ తెలిపారు. వాక్–రన్‌లో విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు కింది లింక్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.
నమోదు లింక్ :
https://docs.google.com/forms/d/e/1FAIpQLSccE57AVP9ejR0HACbX-eVXtcZzPKxmPX-Ug109DyNr3X45M-Q/viewform



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బోనాలతో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినూత్న నిరసన

- 17వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె.. 16 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్
- ఉద్యోగ భద్రత కల్పించి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి: జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. భరత్‌కుమార్



వరంగల్, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 17వ రోజుకు చేరుకుంది. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సర్కిల్‌లో జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు బోనాలు ఎత్తుకొని వినూత్నంగా తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎంలో 78 విభాగాల్లో సుమారు 17,541 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. భరత్‌కుమార్ తెలిపారు. వీరందరినీ తక్షణమే క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్య భద్రత, బీమా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు, పూర్తి స్థాయి వేతనం, సమాన పనికి సమాన వేతనం, విధేయత బోనస్ తదితర 16 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరసనలో భాగంగా పోచమ్మ తల్లి ఆలయం వద్ద తమ సమస్యలతో కూడిన డిమాండ్ల పత్రాలను ఉంచి మొక్కుకున్నారు. బోనాలు ఎత్తుకొని నిరసన తెలపడం ద్వారా తమ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వం తమ ఆవేదనను గుర్తించి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర నిర్వాహకుడు డాక్టర్ గుండా రవీందర్, వైద్యులు హరికృష్ణ, రామ్‌రాజు, యశస్విని, అనిత, మధు, సునీతాదేవి, నిఖిల్, హారిక, ఈవిన్ మేనేజర్ రవీందర్, డైకు మేనేజర్ మేర్గు అనిల్‌కుమార్, నర్సింగ్ అధికారులు స్వప్న, సుమలత, కళ్యాణి, సుష్మ, ఫార్మసీ అధికారులు నూకల అంజి యాదవ్, సంతోష్, శివకుమార్, తీగల సతీష్‌కుమార, ప్రజారోగ్య విభాగం మేనేజర్ జన్ను కార్నెల్, వైకుంఠం, క్షయ వ్యాధి విభాగం సిబ్బంది రంజిత్, రాకేష్, లెక్కల విభాగం సిబ్బంది ఆచంట అభిషేక్, శ్వేత, శ్రీనివాస్‌బాబు, ప్రేమలత, మౌనిక, ఏఎన్ఎంలు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఇతర విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం కుప్ప.. అదుపుతప్పిన బైక్.. వ్యక్తికి తీవ్ర గాయాలు

- అక్రమ ఇసుక రవాణాపై మరో మూడు కేసులు నమోదు
- రోడ్డుపై ధాన్యం పోస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: మొగుళ్లపల్లి ఎస్ఐ ముప్పు సురేష్



భూపాల పల్లి/ మొగుళ్ల పల్లి, అక్టోబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి); ప్రధాన రహదారిపై ధాన్యం కుప్ప పోయడంతో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటనపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు మొగుళ్లపల్లి ఎస్ఐ ముప్పు సురేష్ తెలిపారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, వాటి డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి కాలువ సమీపంలోని ప్రధాన రహదారిపై గిరవేణి కొమురయ్య ధాన్యం కుప్ప పోశారని ఎస్ఐ తెలిపారు. అక్టోబర్ 22న రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో అటుగా మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న బాషిక మహేందర్ ధాన్యం కుప్ప కారణంగా ప్రమాదానికి గురయ్యారని వివరించారు. ఈ ఘటనలో ఆయన తలకు, చెంపకు, కంటికి తీవ్ర గాయాలయ్యాయని, హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. బాధితుడి భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మరోవైపు గురువారం మండలంలోని మొగుళ్లపల్లి–ముల్కలపల్లి గ్రామాల మధ్య వంతెన వద్ద, రంగాపూర్ బస్‌స్టాప్ సమీపంలో, పాత ఇస్సిపేట చర్చి వద్ద పోలీసు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించినట్లు ఎస్ఐ వెల్లడించారు. తనిఖీల్లో పోతుగల్ వాగు, కలికోటపల్లి వాగు, మొగుళ్లపల్లి వాగుల నుంచి ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామని, డ్రైవర్ల వద్ద రవాణా అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడంతో కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రహదారులపై వాహనదారులకు ప్రమాదం కలిగించే విధంగా ధాన్యం కుప్పలు లేదా ఇతర వస్తువులు ఉంచరాదని ఎస్ఐ హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలించవద్దని, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు రహదారి నిబంధనలు పాటిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ ముప్పు సురేష్ సూచించారు.

పూర్తయిన నూతన కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించాలి!

- ప్రజలకు పాలనా సేవలు చేరువ చేయాల్‌లు
- జిల్లా కలెక్టర్‌కు ప్రజా సంఘాల నాయకుల వినతిపత్రం



వరంగల్, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తయినప్పటికీ, ఇంకా ప్రారంభించకపోవడంపై ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన కలెక్టరేట్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. కిషోర్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సుమారు 1,766 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న వరంగల్ జిల్లాలోని సుదూర గ్రామాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుతం హనుమకొండలో ఉన్న కలెక్టరేట్ కార్యాలయానికి రావాల్సి వస్తోందని తెలిపారు. దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేందుకు సమయం, డబ్బు ఖర్చవడమే కాకుండా, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అన్ని వసతులతో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తయినందున, దానిని వెంటనే అందుబాటులోకి తీసుకువస్తే జిల్లా ప్రజలకు పాలనా సేవలు మరింత చేరువవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ప్రారంభోత్సవానికి అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక వ్యవస్థాపకుడు కేడల ప్రసాద్, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ వరంగల్ ఇన్‌చార్జి ఐతం నగేష్, రజక రిజర్వేషన్ సమితి నాయకుడు చాపర్తి కుమార్ గాడ్గే, మంజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పోతన వెంకటేశ్వర్లు, వేల్పుగొండ హరినాథ్, పెరుమాళ్ల లక్ష్మణ్, సిలువేరు నగేష్ తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో రక్తదాన శిబిరం.. 150 యూనిట్ల రక్తం సేకరణ

- పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమం
- శిబిరాన్ని ప్రారంభించిన తూర్పు జోన్ డీసీపీ అంకిత్ కుమార్



వరంగల్ /బొల్లికుంట ,అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో మామునూరు ఉపవిభాగం పోలీసులు, ఎంజీఎం ఆసుపత్రి వైద్యుల సహకారంతో బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. వరంగల్ తూర్పు జోన్ డీసీపీ అంకిత్ కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రక్తదానం ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా సేవ అని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి అండగా నిలిచేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. రక్తదాతలకు హెచడఃపీఫసీ బ్యాంకు ప్రతినిధులు పండ్లు, పండ్ల రసాలు, ఇతర అల్పాహార పదార్థాలను అందజేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానంపై అవగాహన పెంపొందించుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మామునూరు ఏసీపీ ఎన్. వెంకటేష్, ఎంజీఎం ఆసుపత్రి వైద్య బృందం, వాగ్దేవి కళాశాల ఫార్మ్-డి ప్రిన్సిపాల్ కమల్ యాదవ్, మామునూరు, ఏనుమాముల, గీసుకొండ పోలీస్ స్టేషన్ల సీఐలు, సంగెం, పర్వతగిరి, ఏనుమాముల, మామునూరు ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్యే!

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి.. వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క





ములుగుజిల్లా/గోవిందరావుపేట, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్యేనని, విద్యార్థులు ఆసక్తితో చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. చదువుతో పాటు వ్యక్తిగత భద్రతపై కూడా అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. గురువారం ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గోవిందరావుపేట మండలం పసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవితంలోని ప్రతి దశలో విద్య, జ్ఞానం మనకు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎలాంటి కష్టాలు ఎదురైనా విద్యావంతులు తమ జ్ఞానంతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని స్వశక్తితో జీవించగలరని తెలిపారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, సంపాదించిన జ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవాలని సూచించారు. జ్ఞానాన్ని పదిమందికి అందించడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని, ప్రతి ఒక్కరూ చదువుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పాఠశాలల్లో, బస్సులు, ఆటోల్లో ప్రయాణించే సమయంలో, ఇళ్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో ఎదురయ్యే వేధింపులను గుర్తించేలా విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. పిల్లలకు తమ రక్షణకు సంబంధించిన అంశాలను తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుతో పాటు ఆత్మరక్షణకు అవసరమైన విషయాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో), సైబర్ నేరాలు, బాలల అక్రమ రవాణా నివారణ, బాలల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడే బొమ్మ ద్వారా మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను వివరిస్తూ, అనుచిత స్పర్శను గుర్తించడం, అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు అప్రమత్తంగా ఉండటం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భీమ్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడిగా అల్లి ప్రశాంత్ కుమార్

- వాజేడులో నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక
- నూతన కమిటీకి పాత్రికేయుల శుభాకాంక్షలు



ములుగు జిల్లా/వాజేడు (నిత్యం నిఘా ప్రతినిధి): వాజేడు భీమ్ మీడియా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీమ్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా తెలంగాణ వార్త తెలుగు దినపత్రిక ప్రతినిధి అల్లి ప్రశాంత్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా విశాల భారతి ప్రతినిధి అరకిల్ల సమ్మయ్య, కార్యదర్శిగా మన తొలివెలుగు ప్రతినిధి సర్వేశ్వరరావు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా పెన్ గన్ ప్రతినిధి అగ్గి శేఖర్, సీకే న్యూస్ ప్రతినిధి రహీం, నిత్యం నిఘా ప్రతినిధి కార్తీక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నిష్పక్షపాత వార్తలతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పాత్రికేయుల ఐక్యతను కాపాడుకోవాలని సూచించారు. అల్లి ప్రశాంత్ కుమార్ నాయకత్వంలో భీమ్ మీడియా అసోసియేషన్ మరింత బలోపేతమై, పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

జీడికంటి స్వామివారి ప్రసాదం వేలంలో రూ.3.61 లక్షలు!

- లడ్డు, పులిహోర ప్రసాదాల వేలానికి భక్తుల నుంచి విశేష స్పందన
- వేలంపాటను దక్కించుకున్న పరిమళ కిషోర్



జనగాం జిల్లా/లింగాలగణపురం, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): జీడికంటి శ్రీ వీరాచల రామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డు, పులిహోర ప్రసాదాల వేలంపాటకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా, చివరకు పరిమళ కిషోర్ రూ.3,61,000కు వేలంపాటను దక్కించుకున్నారు. స్వామివారి ప్రసాదాన్ని పొందితే అనుగ్రహం లభిస్తుందనే విశ్వాసంతో భక్తులు వేలంపాటలో ఆసక్తిగా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ వేలంపాటను దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ నిఖిల్, ఆలయ కార్యనిర్వహణ అధికారి చిందం వంశీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంపాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి, నిత్య నిర్వహణ, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు వినియోగించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, వేద పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయానికి వచ్చిన ఉండి లెక్కింపు రూ.1,39,500గా నమోదైంది. స్వామివారి దర్శనం కోసం జనగామ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండబోయిన మమతా సంపత్, జనగామ ఉప్పలమ్మ దేవాలయ కార్యనిర్వహణ అధికారి కుర్రముల మోహన్, కొండబోయిన రాములు, సీనియర్ సహాయకుడు భరత్, ఆలయ సిబ్బంది మల్లేష్, రమేష్, సంబీప్ తదితరులు పాల్గొన్నారు

యాదగిరిగుట్టలో రెండు అభివృద్ధి పనులకు భూమిపూజ



యాదగిరిగుట్ట, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రెండు అభివృద్ధి పనులకు శుక్రవారం (అక్టోబర్ 30) భూమిపూజ నిర్వహించనున్నారు. దేవస్థాన చైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డి తన సొంత నిధులతో ఈ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఆలయ ఉత్తర భాగంలో స్వామివారి నిత్య కల్యాణ మండపం (రంగ మండపం) నిర్మాణానికి ఉదయం 11.14 గంటలకు భూమిపూజ చేయనున్నారు. అలాగే రాయగిరి గ్రామం వద్ద స్వాగత తోరణం నిర్మాణానికి మధ్యాహ్నం 12.25 గంటలకు దైవజ్ఞులు నిర్ణయించిన శుభముహూర్తంలో భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. భవానీ శంకర్ పరిశీలించారు. కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై శాఖాధిపతులు, అర్చక సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూమిపూజ కార్యక్రమాలు సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భక్తుల దర్శనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా, ఆలయ నిత్య కార్యకలాపాలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దేవస్థాన అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఈ నిర్మాణ పనులు దోహదపడనున్నాయని దేవస్థాన వర్గాలు తెలిపాయి.

పంచాయతీ పక్కనే బెల్టు షాపు దందా!

- కిరాణా దుకాణం ముసుగులో మద్యం విక్రయాలు?
- ఎంఆర్పీ కంటే అధిక ధరలకు అమ్ముతున్నారంటూ గ్రామస్తుల ఆరోపణలు



మంథని, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి) గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే కిరాణా దుకాణం ముసుగులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగేపల్లి గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. నివాస ప్రాంతంలోనే పట్టపగలు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.

ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు

నాగేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న కిరాణా దుకాణంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాయల్ స్టాగ్ క్వార్టర్ బాటిల్‌పై గరిష్ఠ చిల్లర ధర రూ.220 ఉండగా, అక్కడ రూ.250కు విక్రయిస్తున్నారని పేర్కొంటున్నారు. అధిక ధరలపై ప్రశ్నిస్తే దుకాణం నిర్వాహకులు దురుసుగా సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

మహిళలు, విద్యార్థులకు ఇబ్బందులు?

పంచాయతీ కార్యాలయానికి సమీపంలో, నివాస ప్రాంతంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశంపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఎక్సైజ్ శాఖ స్పందించేనా?

ఈ వ్యవహారంపై మంథని ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సంబంధిత దుకాణంలో తనిఖీలు నిర్వహించాలని గొర్రెంకల సురేష్ కోరారు. మద్యం విక్రయాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిర్ణీత ధరలకే విక్రయిస్తున్నారా? అనే అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అక్రమ నిల్వలు, అనుమతుల్లేని విక్రయాలు లేదా అధిక ధరలకు అమ్మకాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. నాగేపల్లిలో మద్యం విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? క్షేత్రస్థాయి తనిఖీలతో వాస్తవాలను వెలికితీస్తారా? అన్నది వేచి చూడాలి.

ఆహార తయారీ కేంద్రాలపై అధికారుల కొరడా!

- 9 కేంద్రాల లైసెన్సులు సస్పెండ్.. పలు యూనిట్లు మూసివేత
- స్వీట్లలో ఫేషియల్ రోజ్‌వాటర్ వినియోగం.. చనిపోయిన దోమలతో చక్కెర పాకం





హనుమకొండ, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యంగా వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని పలు ఆహార తయారీ కేంద్రాలపై తెలంగాణ ఆహార భద్రత విభాగం అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తీవ్రమైన అపరిశుభ్రత, నాణ్యతా లోపాలు, నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. దీంతో తొమ్మిది తయారీ కేంద్రాల ఆహార భద్రత లైసెన్సులను సస్పెండ్ చేయడంతో పాటు, పలు యూనిట్ల కార్యకలాపాలను నిలిపివేశారు. నాలుగు షోకాజ్ నోటీసులు, ఒక మెరుగుదల నోటీసు జారీ చేశారు. కేంద్ర లైసెన్స్ పరిధిలోని మరో తయారీ కేంద్రం లైసెన్స్ సస్పెన్షన్‌కు సిఫార్సు చేశారు. తెలంగాణ ఆహార భద్రత కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి జ్యోతిర్మయి పర్యవేక్షణలో పది ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. మిఠాయిలు, మసాలా దినుసులు, నూనెలు, అల్లం వెల్లుల్లి పేస్టు, సోంపు, ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రాలతో పాటు ఇతర ఆహార ఉత్పత్తుల యూనిట్లను అధికారులు తనిఖీ చేశారు.

స్వీట్లలో ముఖానికి రాసుకునే రోజ్‌వాటర్!

తనిఖీల్లో స్వీట్ల తయారీలో సువాసన కోసం ముఖానికి రాసుకునే ఫేషియల్ రోజ్‌వాటర్‌ను ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చిప్స్ తయారీకి నిల్వ ఉంచిన బంగాళాదుంపలు కుళ్లిపోయి ఉండగా, అల్లానికి బూజు పట్టినట్లు గుర్తించారు. రూ.9,400 విలువైన గడువు ముగిసిన ఆహార పదార్థాలను గడువు ఉన్న ఇతర పదార్థాలతో కలిపి నిల్వ ఉంచినట్లు వెల్లడించారు. ఒక సోంపు తయారీ కేంద్రంలో సరైన చిరునామా, అవసరమైన వివరాలు లేని లేబుళ్లతో అనుమానాస్పదంగా ఉన్న 5,045 కిలోల ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5,41,150గా అధికారులు పేర్కొన్నారు.

చక్కెర పాకంలో చనిపోయిన దోమలు.. అపరిశుభ్ర వాతావరణం

మిఠాయిల తయారీకి ఉపయోగించే చక్కెర పాకంలో చనిపోయిన దోమలు కనిపించినట్లు అధికారులు గుర్తించారు. తయారీ కేంద్రంలో కుక్కలు సంచరిస్తుండటం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం ఆహార భద్రతా ప్రమాణాలపై తీవ్ర నిర్లక్ష్యాన్ని సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

ముడి పదార్థాలను విద్యుత్ నియంత్రణ ప్యానళ్ల లోపల నిల్వ ఉంచడం, విద్యుత్ బోర్డులు తెరిచి ఉండటం, అగ్నిమాపక పరికరాల నిర్వహణ సరిగా లేకపోవడం వంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించారు. నీటి నిల్వ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు, తయారీ కేంద్రాల పక్కనే దుర్వాసన వెదజల్లే మురుగు కాలువలు ఉన్నట్లు తెలిపారు. వంటగది నేల జిడ్డుగా, జారిపోయే ప్రమాదంతో ఉండగా, నూనె నిల్వ ట్యాంకులు, నూనె నింపే ఇనుప డబ్బాలు, స్వీట్ల తయారీ యంత్రాలు తుప్పు పట్టి దుమ్ముతో నిండిపోయినట్లు గుర్తించారు. ప్యాకేజింగ్ సామగ్రిపై బ్రాండ్ పేర్లను తప్పుగా ముద్రించినట్లు గుర్తించి, సుమారు 80 కిలోల తప్పుడు లేబుళ్ల సామగ్రిని ధ్వంసం చేశారు. ఆహార తయారీ సిబ్బందికి అవసరమైన ఆహార భద్రత శిక్షణ లేకపోవడం, వైద్య ధ్రువపత్రాలు, నీటి నాణ్యత పరీక్ష నివేదికలు, పురుగుల నియంత్రణ రికార్డులు అందుబాటులో లేకపోవడం వంటి లోపాలను కూడా గుర్తించారు. సిబ్బంది కనీస రక్షణ దుస్తులు, చేతి తొడుగులు ధరించకపోవడాన్ని అధికారులు గమనించారు.

నమూనాలు ప్రయోగశాలకు.. ఉల్లంఘనలపై కఠిన చర్యలు

తనిఖీల్లో సేకరించిన అనుమానాస్పద ఆహార నమూనాలను నాణ్యత పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించిన కేంద్రాలపై చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సహాయ ఆహార నియంత్రణ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లు, మిఠాయి, మసాలా తయారీ కేంద్రాల నిర్వాహకులు చెల్లుబాటయ్యే ఆహార భద్రత లైసెన్సులను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఆహార తయారీలో పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో వివిధ జిల్లాలకు చెందిన ఆహార భద్రత అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించేందుకు తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

పట్టభద్రులారా.. ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి





వరంగల్/వర్ధన్నపేట, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రోత్సహించేందుకు వర్ధన్నపేట పట్టణంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్ సూచనల మేరకు ఆయన కార్యాలయంలో అర్హులైన పట్టభద్రుల కోసం ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు సదుపాయం కల్పిస్తున్నారు.పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులు అవసరమైన వివరాలు, సంబంధిత ధ్రువపత్రాలతో కార్యాలయాన్ని సంప్రదించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. అర్హులైన వారెవరూ నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మూడో డివిజన్ అధ్యక్షుడు కొండేటి సుధాకర్, ఐత సుధాకర్, లింగం రజితరెడ్డి, ఎం.డి. సోహెల్, విలాసారపు వెంకట్ గౌడ్, నోముల గౌరవ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

అన్నారం షరీఫ్‌లో మహిళా సంఘం భవనం ప్రారంభం

- మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి
- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మాలోతు శంకర్ నాయక్, గ్రామ ప్రజాప్రతినిధులు





పర్వతగిరి, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో మహిళా సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అలాగే నూతన భవన నిర్మాణ పనులకు ముగ్గు పోసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో మాలోతు శంకర్ నాయక్ హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ గాడిపల్లి మహేందర్, ఉప సర్పంచ్ గొడుగు ఏకాంతం సారయ్య, మార్కెట్ డైరెక్టర్ గొడుగు భిక్షపతి, ఏసీఎస్ డైరెక్టర్ మోటపోతుల సుదర్శన్, ఏపీఎం రాజీవ్, సీసీ సుధాకర్ పాల్గొన్నారు. వార్డు సభ్యులు భాషబోయిన రామకృష్ణ, బత్తిని జలంధర్, రాపోలు అనిత, రాపోలు రవీందర్, గాడిపల్లి రాజబాబు, ముంజంపల్లి నాగరాజు, రాధిక, దంతమాల పవన్ కళ్యాణ్, మోట పోతుల సారంగపాణి, ఈరగాని సాంబయ్య, రామసాని కృష్ణమోహన్, జనగాం లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి విమల, రాజు, గుండ యాకయ్య కూడా పాల్గొన్నారు. మహిళా సంఘం అధ్యక్షురాలు ప్రవళిక, అమ్మాజీ, స్రవంతి, గ్రామ మహిళా సమాఖ్య సహాయకులు శైలజ, సంధ్య, స్రవంతితో పాటు మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రముఖులు, మహిళలు, యువజన సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల అభివృద్ధి, బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. మహిళా సంఘాల భవనాలు గ్రామీణ మహిళలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, సంఘాల కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించడానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు!

- మంథని పుష్కర ఘాట్ అభివృద్ధికి రూ.23 కోట్లు మంజూరు
- రూ.10 కోట్లతో గౌతమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం
- కాశీ తరహాలో ప్రతిరోజూ సాయంత్రం గోదావరికి సప్త హారతులు
- మార్చి చివరి నాటికి ఘాట్ పనులు పూర్తి చేయాలని లక్ష్యం



మంథని, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు పరిమిత సమయం మాత్రమే ఉండటంతో అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గురువారం దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్‌ను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శైలజ రామయ్యార్ మాట్లాడుతూ మంథనికి పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మంథని పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ కోసం ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఘాట్‌ను విస్తరించి, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

కాశీ తరహాలో గోదావరికి సప్త హారతులు

మంథనిలో కాశీ తరహాలో ప్రతిరోజూ సాయంత్రం గోదావరి నదికి సప్త హారతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. మంథనితో పాటు ఓదెల, రామగుండం ప్రాంతాల్లోనూ చిన్న పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

రూ.10 కోట్లతో గౌతమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం

మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని రూ.10 కోట్ల వ్యయంతో ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు శైలజ రామయ్యార్ తెలిపారు. ఆలయ పవిత్రత, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపడుతున్నట్లు వివరించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షత వహిస్తున్నారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు

పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, కాంట్రాక్టర్ ఎంపిక కూడా పూర్తయినందున త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు. మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, తహసీల్దార్ ఆరిపోద్దిన్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, సీఐ బుద్దే స్వామి, కాంట్రాక్టర్ శ్రీరామ్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూర్తయిన నూతన కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించాలి!

- ప్రజలకు పాలనా సేవలు చేరువ చేయాలి
- జిల్లా కలెక్టర్‌కు ప్రజా సంఘాల నాయకుల వినతిపత్రం



వరంగల్, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తయినప్పటికీ, ఇంకా ప్రారంభించకపోవడంపై ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన కలెక్టరేట్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. కిషోర్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సుమారు 1,766 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న వరంగల్ జిల్లాలోని సుదూర గ్రామాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుతం హనుమకొండలో ఉన్న కలెక్టరేట్ కార్యాలయానికి రావాల్సి వస్తోందని తెలిపారు. దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేందుకు సమయం, డబ్బు ఖర్చవడమే కాకుండా, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అన్ని వసతులతో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తయినందున, దానిని వెంటనే అందుబాటులోకి తీసుకువస్తే జిల్లా ప్రజలకు పాలనా సేవలు మరింత చేరువవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ప్రారంభోత్సవానికి అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక వ్యవస్థాపకుడు కేడల ప్రసాద్, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ వరంగల్ ఇన్‌చార్జి ఐతం నగేష్, రజక రిజర్వేషన్ సమితి నాయకుడు చాపర్తి కుమార్ గాడ్గే, మంజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పోతన వెంకటేశ్వర్లు, వేల్పుగొండ హరినాథ్, పెరుమాళ్ల లక్ష్మణ్, సిలువేరు నగేష్ తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం

- సరఫరా ముఠాలే లక్ష్యంగా పోలీసుల కార్యాచరణ!



పెద్దపల్లి జిల్లా/గోదావరిఖని, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ సరఫరా, విక్రయాలను అరికట్టేందుకు పెడ్లర్లపై నిరంతర నిఘా ఉంచాలని, వారికి మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులను గుర్తించి మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించాలని తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఎస్పీ గిరిధర్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ పరిధిని మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం (ఎన్‌డీపీఎస్) కేసుల ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఎస్పీ గిరిధర్ మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల పురోగతి, పెండింగ్ కేసులు, దర్యాప్తు స్థితిగతులు, నిందితుల కార్యకలాపాలు, గంజాయి సరఫరా మార్గాలపై సమీక్షించారు. పెండింగ్ కేసులకు గల కారణాలను అడిగి తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల గుర్తింపు, సరఫరా మూలాల అన్వేషణలో వృత్తిపరమైన నైపుణ్యంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. గంజాయి విక్రయించే వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతోనే సరిపెట్టుకోకుండా, వాటి వెనుక ఉన్న ప్రధాన సరఫరాదారులను గుర్తించాలని గిరిధర్ సూచించారు. పెడ్లర్ల నుంచి ప్రధాన సరఫరాదారుల వరకు మొత్తం వ్యవస్థను వెలికితీసేలా లోతైన దర్యాప్తు చేపట్టాలన్నారు. అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలపై నిఘా పెంచుతూ అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాలు, సరఫరా మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

డ్రగ్స్ నిర్మూలనకు సమగ్ర కార్యాచరణ

సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్‌ను మాదకద్రవ్య రహిత ప్రాంతంగా మార్చేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, నిల్వలు, రవాణాపై నిఘా పెంచడంతో పాటు సమాచార వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ దర్యాప్తు చేపట్టాలని, ప్రధాన సరఫరాదారులు, రవాణా మార్గాలు, ఆర్థిక లావాదేవీలు, నెట్‌వర్క్‌పై విచారణను విస్తరించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన అనేది కేసులు నమోదు చేయడంతోనే పూర్తికాదని సీపీ పేర్కొన్నారు. సరఫరా మూలాలను ఛేదించడంతో పాటు మత్తు పదార్థాల వినియోగానికి అలవాటుపడిన వారికి కౌన్సెలింగ్, అవసరమైన పునరావాస సహాయం అందించాలని తెలిపారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా చూడటంతో పాటు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంచడం పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

55 మంది యువతకు కౌన్సెలింగ్

సమావేశం అనంతరం కమిషనరేట్ పరిధిలో గంజాయి వినియోగానికి అలవాటుపడిన 55 మంది యువతతో సీపీ అంబర్ కిషోర్ ఝా, ఎస్పీ గిరిధర్ మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి కిరణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్, ఈగిల్ ఫోర్స్ కరీంనగర్ ఆర్ఎస్సీసీ డీఎస్పీ ఎస్. ఉపేందర్, నిజామాబాద్ ఆర్ఎన్‌సీసీ డీఎస్పీ సోమనాథ్, హైదరాబాద్ ఆర్ఎన్ఎస్‌సీసీ డీఎస్పీ పుష్పకుమార్‌తో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలి

- మంగపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్
- డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిరంతరం చేపట్టాలని సూచన



ములుగు జిల్లా/మంగపేట, అక్టోబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): గంజాయి అక్రమ రవాణా, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్ పోలీసు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగపేట పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించి, స్టేషన్ రికార్డులు, కేసుల పురోగతి, పోలీసుల విధుల నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో పాటు వాహన తనిఖీలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు.గ్రామ పోలీసు అధికారుల బాధ్యత కీలకమని పేర్కొంటూ, వారికి కేటాయించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లోకి గంజాయిని ఎవరు తీసుకొస్తున్నారు, అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారు ఎవరు అనే అంశాలపై నిఘా ఉంచి, సంబంధిత సమాచారాన్ని నమోదు చేసుకోవాలని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను పూర్తిస్థాయిలో తెలుసుకుని, ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఏఎస్పీ వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.విధి నిర్వహణలో ప్రతిభ కనబరుస్తూ ప్రజలకు సేవలందిస్తున్న, నేరాల నియంత్రణలో చురుకుగా పనిచేస్తున్న పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ తనిఖీలో ఏటూరునాగారం సీఐతో పాటు మంగపేట ఎస్సైలు టీవీఆర్ సూరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.